# 18951 పైన స్థిరపడితే రికవరీ

**సమీక్ష:** అంతక్రితం రెండు వారాల ధోరణిని వదలిపెట్టి మార్కెట్ రికవరీ బాట పట్టింది. విదేశీ సంస్థాగత మదుపుదార్ల(ఎఫ్ఐఐ) కొనుగోళ్లు పెరగడంతో పాటు ప్రపంచ వ్యాప్త మదుపర్ల ఆశావహ దృక్పథం ఇందుకు కారణమైంది.

ముడి చమురు ధరలు పెరగడం, ఎఫ్ఐఐల విక్రయాలతో మార్కెట్ బలహీనంగానే ప్రారంభమైంది. అయితే జీఎస్టీ, బ్యాంకింగ్, పెన్షన్ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడంతో సానుకూల పవనాలు వీచాయి. జపాన్ కాస్త కోలుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లు పుంజుకోవడం కూడా ఇందుకు దోహదం చేసింది. ఆహార ద్రవ్యోల్బణం పెరిగినా కంపెనీలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వారెన్ బఫెట్ తన భారత పర్యటనలో పేర్కొనడంతో వారం మొత్తం మీద 937 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 18816 వద్ద స్థిరపడింది.




**ఎఫ్ఐఐల తీరు:** ఎఫ్ఐఐలు మళ్లీ కొనుగోళ్ల బాట పట్టి రూ.529 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. ఫండ్లు రూ.48 కోట్ల నికర విక్రయాలు చేశారు.

**రంగాల వారీగా:** బ్యాంకింగ్ సవరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడంతో ఆ రంగ షేర్లు లాభాలందుకున్నాయి. అమెరికాలో రికవరీ సూచనలు ఐటీ షేర్లకు అనుకూలంగా పనిచేశాయి. మరో పక్క మన్నికైన వినియోగదారు వస్తువులు, చమురు-సహజవాయువు, ఆరోగ్య సంరక్షణ రంగాలు రాణించలేకపోయాయి.

శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదుకావడం చూస్తే కొనుగోళ్లపై ఆసక్తి కలిగిందని తెలుస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** స్వల్పకాలంలో బలహీనతలు తీవ్రతరమవుతాయన్న సంకేతాలు వచ్చినప్పటికీ సెన్సెక్స్ సోమవారం నాటి కనిష్ఠ స్థాయి 17792 నుంచి పుంజుకుంది. 8 వారాల గరిష్ఠం 18858కి చేరి 18816 వద్ద స్థిరపడింది. 200 రోజుల చలన సగటు 18951 పైన వరుసగా రెండు రోజులు కనుక మార్కెట్ ముగిస్తే స్వల్పకాలంలో రికవరీ కొనసాగొచ్చు. ఒకవేళ 18058 స్థాయి కంటే దిగువన ముగిస్తే మళ్లీ స్వల్పకాల దిద్దుబాటులోకి ప్రవేశించవచ్చు.

**ప్రభావం చూపే అంశాలు:** ఎఫ్ఐఐల నిధుల ప్రవాహం కొనసాగితే మద్దతు లభించవచ్చు. గురువారంతో గడువు తీరనున్న డెరివేటివ్ కాంట్రాక్టుల నేపథ్యంలో మార్కెట్లో ఊగిసలాట పెరగొచ్చు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లు జరగవచ్చు.దేశీయంగా ఆహార ద్రవ్యోల్బణం గణాంకాలు, అంతర్జాతీయంగా జపాన్, లిబియా మధ్యప్రాచ్య పరిణామాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18951, 191000, 19341;

**తక్షణ మద్దతు స్థాయిలు:** 18523, 18374, 18218

**18951 కంటే పైన ముగిస్తే స్వల్పకాలంలో రికవరీ కొనసాగవచ్చు.**

–సతీశ్ కంతేటి, జెన్ మనీ